క్లుప్తంగా

నేడు పేరంటాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రామవరప్పాడు: గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆరోగ్యం కుదుట పడాలని, త్వరగా బెయిల్ మంజూరై ప్రజాసేవలో ఉండాలని కోరుతూ శుక్రవారం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని ఆ పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు శీలం రంగారావు తెలిపారు. ఉదయం 9 గంటలకు పేరంటాలమ్మ ఆలయంలో పూజలు, అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

అన్నసమారాధనకు వైఎస్సార్ సీపీ విరాళం



పెనమలూరు: వణుకూరులో శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న అన్నసమారాధనకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి ప్రకటించిన రూ.10 వేలు విరాళాన్ని గురువారం గ్రామ వైఎస్సార్ సీపీ నేతలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉప సర్పంచి ఆరేపల్లి నాగరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు చక్కా గోపీ, నేతలు వణుకూరు నాగరాజు, దయ్యాల కిషోర్, కొల్లా శ్రీనివాసరావు, అంకప్రసాద్, ఆరేపల్లి శ్రీకాంత్, విజయ్, మనోహర్ పాల్గొన్నారు.

చోడవరంలో అభివృద్ధి పనులు ప్రారంభం



పెనమలూరు: చోడవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. గ్రామంలో ఆర్ అండ్ బీ, ఎన్ఆర్జీఎస్‌కు చెందిన దాదాపు రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచి కాకర్ల వెంకటరత్నం, టీడీపీ నేతలు కోయా ఆనంద్ ప్రసాద్, మూరుపూడి ధనకోటేశ్వరరావు, కలపాల శ్రీధర్, దొండపాటి సురేష్, సంగెపు రంగారావు తదితరులు పాల్గొన్నారు.

వంశీమోహన్‌కు ఆరోగ్యం కుదుట పడాలని పూజలు

నున్న(విజయవాడరూరల్): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఆరోగ్యం కుదుట పడాలని, త్వరగా బెయిల్ రావాలని ఆకాంక్షిస్తూ నున్న గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం కుటుంబ సమేతంగా ఆంజనేయస్వామికి పూజలు చేశారు. మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, మాజీ ఉప సర్పంచి భీమవరపు శివరామిరెడ్డి దంపతులు, మాజీ ఏఎంసీ సభ్యుడు దండు సుబ్రహ్మణ్యం రాజు, భీమవరపు నరేంద్ర రెడ్డి దంపతులు తదితరులు పూజలు చేశారు.

28న గన్నవరంలో జాబ్‌మేళా

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఈ నెల 28వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన పదికి పైగా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఏడు నుంచి పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ ఉత్తీర్ణులైన యువతీ, యువకులు జాబ్ మేళాకు అర్హులుగా తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పిస్తారన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్ పత్రాలు, ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని సూచించారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సమాచారం కోసం 94940 05725, 63006 18985 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సరస్వతి నది పుష్కరాలకు ప్రత్యేక బస్సు

గన్నవరం: సరస్వతి నది పుష్కరాలకు గన్నవరం ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 24వ తేదీన ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం పి.శివాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక బస్సులో మహాకాళేశ్వరంలో పుష్కర స్నానం అనంతరం వరంగల్ భద్రకాళీ దేవాలయం, వేములవాడ శ్రీరాజరాజేశ్వరి ఆలయం, కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవాలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి గుడి, కాళేశ్వరంలో శ్రీమహాకాళేశ్వర ఆలయం దర్శించుకుని పుష్కర స్నానం తర్వాత రామప్ప గుడిని దర్శించుకోవచ్చని పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గన్నవరం నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరి తిరిగి 27వ తేదీ ఉదయం ఇక్కడికి చేరుకుంటుందన్నారు. బస్సు టికెట్ ధరను రూ.2,100గా నిర్ణయించినట్లు, ఆన్‌లైన్ బుకింగ్ సదుపాయం కూడా ఉందన్నారు.

ప్రారంభానికి నోచుకోని

బ్లాక్ పబ్లిక్ హెల్త్ భవనం

- భవనం నిర్మించారు... వైద్య సేవలు మరిచారు
- అందుబాటులో లేని పరికరాలు, సిబ్బంది



పెనమలూరులో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు గ్రహణం పట్టుకుంది. ఇక్కడ భవన నిర్మాణం పూర్తి చేసినా నేటికీ వైద్య పరికరాలు, సిబ్బంది నియామకం జరగకపోవటంతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభానికి నోచుకోలేదు. వివరాల్లోకి వెళితే జిల్లాలో ప్రజలకు అన్నిరకాల వైద్య పరీక్షలకు మైక్రో బయాలజీ ల్యాబ్ పెనమలూరు పీహెచ్‌సీలో ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్ణయించారు. నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) 15వ ఫైనాన్స్ హెల్త్ గ్రాంట్స్ రూ.50 లక్షల నిధులు బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గత ఆగస్టులో భవన నిర్మాణానికి పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో కూటమి నేతలు శంకుస్థాపన చేశారు. ఈ భవనాన్ని కాంట్రాక్టర్ సకాలంలో పూర్తి చేశారు. త్వరలో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ భవనం ప్రారంభమవుతుందని, అత్యాధునిక వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు భావించారు.

మైక్రో బయాలజీ ల్యాబ్ సేవలు ఇవే..

మైక్రో బయలాజికల్ ల్యాబ్ ద్వారా ఇక్కడ పేద ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేశారు. బీపీ, షుగర్, వివిధ రకాల రక్త పరీక్షలు, థైరాయిడ్, లివర్, కిడ్నీ ఇలా అన్నిరకాల వైద్య పరీక్షలు ఇక్కడ చేస్తారు. ఇలా అన్నిరకాల వైద్య పరీక్షలు చేయటం వలన పేషెంట్ ఎటువంటి వ్యాధితో ఇబ్బంది పడుతున్నారనే విషయం నిర్ధారణ అవుతుంది. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ద్వారా పేషెంట్‌కు కచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేయగలుగుతారు. వైద్య పరీక్షలు చేసిన తరువాత వచ్చే రిపోర్టు ఆధారంగా వైద్యులు రోగి ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి అవగాహనతో నాణ్యమైన వైద్యం అందించటానికి ఆస్కారం ఉంటుంది. జిల్లాలో పెనమలూరు కేంద్రం అందరికీ అందుబాటులో ఉంటుందని రూ.50 లక్షలతో నిర్మాణం చేసి యూనిట్ ఏర్పాటుకు ల్యాబ్ భవనం నిర్మించారు. సకాలంలో భవన నిర్మాణం పూర్తయి మూడు నెలలు గడుస్తున్నా నేటికీ వైద్య సేవలు మాత్రం అందుబాటులోకి రాలేదు. ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటుతో పాటు అనుభవం కలిగిన పెథాలజీ, మైక్రోబయాలజీ, రేడియేషన్, ల్యాబ్ టెక్నీషియన్స్, ఇతర అనుభవం కలిగిన సిబ్బందిని నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల ప్రకియ జరుగుతున్నందున సిబ్బందిని ప్రభుత్వం వెంటనే నియమించాలని స్థానికులు కోరుతున్నారు. బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చి భవనం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యూనిట్ ప్రారంభించండి



ప్రజలకు ఎంతగానో ఉపయోగపడే బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను వెంటనే ప్రారంభించి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి. ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలి.

– వెంకట నాగేష్, పెనమలూరు

యనమలకుదురు సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు

పెనమలూరు: యనమలకుదురు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం యనమలకుదురు వంతెన వద్ద సీపీఎం నేతలు ఆందోళన చేశారు. అనంతరం ఈమేరకు తాడిగడప మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. యనమలకుదురు జన్మభూమి వంతెన వద్ద ఇందిరానగర్ గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని, రోడ్డు నిర్మించాలని, లాకుల సమీపంలో కనకదుర్గ ఆలయం వద్ద చెత్త వేయటం వలన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. 2వ వార్డులో డ్రైనేజీ పై ఉన్న సిమెంట్ బిళ్లలు ఊడిపోయి నడవటానికి వీలు లేకుండా ఉందన్నారు. 3వ వార్డు వీధి దీపాలు వెలగక పోవటంతో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. శేషమాంబ ఆశ్రమం స్థలం ఆక్రమణలకు గురవుతోందని, ఆ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం, సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కొండబాబు, నేతలు షేక్ మస్తాన్‌వలి, పిల్లి వసంతరావు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బోడెప్రసాద్ తదితరులు

పెనమలూరు: కానూరులో కనకమహాలక్ష్మి కోఆపరేటివ్ బ్యాంక్ 34వ శాఖను గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకులు అన్ని వర్గాల ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. బ్యాంక్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మారెడ్డి రాంబాబు మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా 1999లో తమ బ్యాంకు ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో 34 శాఖలు ఉన్నాయని, రూ.1020 కోట్లు డిపాజిట్లు, రూ.680 కోట్ల రుణాలు, రూ.1700 కోట్లు వ్యాపారం సాగిస్తుందన్నారు. మరో 5 శాఖలు త్వరలో ప్రారంభిస్తామని, తెలంగాణలో కూడా బ్యాంకు సేవలు విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ధనేకుల మురళీమోహన్‌రావు, నాగార్జున హాస్పిటల్ ఎండీ డాక్టర్ కొడాలి జగన్ మోహన్‌రావు, డాక్టర్ వల్లభనేని వెంకటేశ్వరరావు, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.శ్యామ్‌కిషోర్, విజయవాడ రీజినల్ మేనేజర్ జాస్తి మురళి, కానూరు శాఖ మేనేజర్ పి.నెహ్రూజీ పాల్గొన్నారు.

ఆటల పోటీలతో విద్యార్థుల్లో మనోవికాసం



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



తెన్నేరు గ్రంథాలయంలో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

గన్నవరంరూరల్: ఆటపాటలు విద్యార్థుల మనోవికాసానికి దోహదం చేస్తాయని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయ లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. గురువారం సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలను ఎంపిక చేసి అభినందించారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ జ్యోతికుమారి ఆధ్వర్యంలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు.

విద్యార్థులతో పుస్తక పఠనం

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చిమట రామారావు పర్యవేక్షణలో విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థులకు శిక్షణ

కంకిపాడు: కంకిపాడు శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పుస్తక పఠనంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పోటీలను గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, కె.రాంబాబు పర్యవేక్షించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ ఇచ్చారు. రీడర్ దుర్గామల్లేష్ చిన్నారులకు చిత్రలేఖనంలో మెలకువలు నేర్పించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

అంజనీపుత్రునికి ప్రణమిల్లిన భక్తకోటి



వేకువజామున అంజనీపుత్రునికి అభిషేకం చేస్తున్న ఈవో తారకేశ్వరరావు



గ్రామోత్సవంలో కేరళ సంప్రదాయ మేళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వేలాది మంది భక్తులు అంజనీపుత్రుడిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. తెల్లవారుజాము మూడు గంటల నుండే భక్తులు దేవస్థానం వద్ద క్యూలైన్‌లో బారులు తీరారు. శ్రీ ఆంజనేయం, అభయాంజనేయం, జై హనుమాన్ నామస్మరణలతో జంక్షన్ మార్మోగింది. గన్నవరం, ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, బడేటి రాధాకృష్ణ (చంటి), చింతమనేని ప్రభాకర్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అభయాంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వామివారికి విశేష పూజలు...

తెల్లవారుజామున మూడు గంటల నుంచే అభయాంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేకపూజలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధానార్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు నేతృత్వంలో అర్చకులు గొట్టిపాళ్ల శ్రీనివాసాచార్యులు, శృంగారం రామాచార్యులు స్వామికి సప్తనది జలాలు, పంచామృతాలు, రకరకాల పండ్ల రసాలతో అభిషేకాలను కనులపండువగా నిర్వహించారు. అనంతరం అంజనీపుత్రుడిని నూతన వస్త్రాలు, బంగారు, వెండి ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉదయం 4 గంటలకు ప్రభాతసేవ, అర్చన, వేదపారాయణం నిర్వహించారు. పలు వ్యాపార, స్వచ్ఛంద సేవా సంస్థలు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి భక్తులకు మంచినీళ్లు, మజ్జిగ, మామిడి పండ్లు, ప్రసాదాలను పంపిణీ చేశారు.

25 వేల మందికి మహా అన్నప్రసాద వితరణ

హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో 25 వేల మందికి భక్తులకు అన్నదానం చేశారు. స్థానిక వేలేరు ముఖద్వారం వద్ద ఉన్న శ్రీవిఘ్నేశ్వర, పంచముఖ అంజనేయ సమేత సీతారామచంద్ర స్వామి ఆలయం వద్ద భారీ అన్నదానం జరిగింది. ఆలయ దాత కనుమూరి సూర్యనారాయణరాజు (చిన్నరాజు) కుటుంబ సభ్యుల నేతృత్వంలో లారీ ఓనర్స్, వర్కర్స్ కులమతాలకు అతీతంగా చేతులు కలిపి భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేయటం విశేషం. సాయంత్రం అభయాంజనేయ స్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది.

లడ్డూ ప్రసాదం వేలం పాట

స్వామి వారి పాదాల చెంత గత ఆరు రోజులుగా నైవేద్యంగా పెట్టిన మూడు లడ్డూ ప్రసాదాలను దేవదాయ శాఖ అధికారులు వేలం పాట ద్వారా విక్రయించారు.

బహుముఖ ప్రతిభాశాలి వేటూరి



వేటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రమాసత్యనారాయణ, చంద్రశేఖర్, విజయలక్ష్మి తదితరులు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి వేటూరి సుందరరామమూర్తి అని విశ్వమాత చారిటబుల్ సంస్థ వ్యవస్థాపకుడు నిడుమోలు రమాసత్యనారాయణ కొనియాడారు. గీతాంజలి మ్యూజిక్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తుమ్మపల్లిలోని వేటూరి విగ్రహంవద్ద 15 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రమాసత్యనారాయణ మాట్లాడుతూ.. తెలుగు సినిమా పాటకు అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన ఘనత వేటూరికే దక్కిందన్నారు. వేటూరి పాటల పరిశోధకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి మాట్లాడుతూ.. వేటూరి పాటల్లో రచనాశైలి వైవిధ్యంగా ఉంటుందన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు పరుచూరి విజయలక్ష్మి, సింగంశెట్టి చంద్రశేఖర్, ప్రభల శ్రీనివాస్, నరసింహారావు, చిట్టిబాబు, శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమజ్జయంతి పర్వదిన వేడుకలు



చిక్కవరంలో విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ సూర్య ఆంజనేయ స్వామి



ఉయ్యూరులో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జంపాన పూర్ణిమ



పోరంకిలో అలంకరణలో అభయాంజనేయ స్వామి విగ్రహం

గన్నవరం: హనుమజ్జయంతి వేడుకలను గన్నవరం ప్రాంతంలోని పలు ఆలయాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీఅభయాంజనేయస్వామి ఉపాలయం భక్తులతో కిటకిటలాడింది. తొలుత ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో స్వామివారికి 75 వేల తమలపాకులతో సహస్ర నామార్చనలు జరిపారు. స్వామివారికి 50 వేల చిట్టి గారెలు, 50 వేల అప్పాలను నివేదించారు. అనంతరం గ్రామంలో భక్తులతో హనుమాన్ శోభాయాత్రను నిర్వహించారు. శ్రీఅభయాంజనేయస్వామి వారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. కేసరపల్లిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, అన్నసంతర్పణ జరిపారు.

నున్న గ్రామంలో...

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని ప్రముఖ యోగా కేంద్రం యోగేశ్వర్ దేవీదయాళ్ మహామందిర్‌లో యోగా గురువు అమిత్‌దేవ్ ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హనుమంతునికి అభిషేకాలు నిర్వహించిన పిమ్మట అన్నదానం చేశారు. యోగాచార్య గుంటక విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పోలవరం కాల్వ సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఉదయం పంచామృతాలతో అభిషేకాలు చేసి హనుమాన్ చాలీసా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. దేవగిరి రంగారెడ్డి దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చినకంచిలో సంప్రదాయ బద్ధంగా అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. బోడపాడు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. పాతపాడులో దేవగిరి ఓంకార్ రెడ్డి ఆధ్వర్యంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పంచామృతాలతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం అన్నసంతర్పణ జరిగింది. అంబాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా పూజాకార్యక్రమాలు జరిగాయి.

రామవరప్పాడులో అన్నసంతర్పణ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు జెండా చెట్టు సెంటర్‌లోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానం వద్ద గురువారం హనుమజ్జయంతి పురస్కరించుకుని అన్నసంతర్పణ నిర్వహించారు. ఆలయం వద్ద ఉదయం నుంచి పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద 4వేల మందికి మహా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొండేటి చలపతిరావు, కొండేటి శేషారావు, పిన్నిబోయిన వెంకట్రావు, కాగిత జ్ఞాన ప్రకాష్‌రావు, రాచమళ్ల శ్రీనివాసరావు, టంకసాల వెంకటేశ్వరరావు, టంకసాల శివ, శ్రీనివాసరావు, సూరిబాబు, నవీన్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కంకిపాడులో...

కంకిపాడు: హనుమజ్జయంతి పర్వదినాన్ని భక్తులు అత్యంత వైభవంగా జరుపుకొన్నారు. గురువారం హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాలు, ఆంజనేయస్వామి దేవస్థానాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ఉదయం నుంచి పండ్ల రసాలతో అభిషేకాలు, ఆకుపూజలు చేయించారు. కంకిపాడు, ఈడుపుగల్లు, మద్దూరు, చలివేంద్రపాలెం, ఉప్పలూరు, మంతెన, ప్రొద్దుటూరు గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. చలివేంద్రపాలెంలోని శ్రీ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఆకుపూజ, పంచామృతాలతో అభిషేకాలు చేయించారు. స్వర్ణకంకణ గ్రహీత కోసూరు శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులకు అన్నసమారాధన జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గన్నవరం మండలంలో...

గన్నవరంరూరల్: మండలంలోని చిక్కవరం శ్రీ సూర్య ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం వేళ స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణ చేసి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. పండ్లు, పూలు, తమలపాకులు, నిమ్మకాయలతో విశేషంగా అలంకరించిన స్వామివారిని భక్తులు దర్శించారు. అష్టోత్తర పూజలు, భజన సత్సంగాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీ పర్యవేక్షించారు. సూరంపల్లి, పురుషోత్తపట్నం, బీబీగూడెం, తెంపల్లి, వీరపనేనిగూడెం గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకొన్నారు.

పోరంకిలో...

పెనమలూరు: పోరంకి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామివారి ఆలయంలో శ్రీ హనుమజ్జయంతి మహోత్సవం గురువారం ఘనంగా చేశారు. ఉదయం 5 గంటలకు లోక కల్యాణార్థం విశేష అర్చన, 6 గంటలకు పంచామృతాభిషేకం, ఫల రసాలు, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి విశేష అభిషేకం చేశారు. ఉదయం 7.30 గంటలకు గంధ సింధూరంతో స్వామివారికి పూజ నిర్వహించి ఉదయం 8 గంటలకు తమలపాకులతో అర్చన చేశారు. సాయంత్రం 6 గంటలకు విశేషార్చన, రాత్రి 8 గంటలకు నక్షత్ర హారతి సమర్పిస్తారు. ఆలయంలో ఉదయం 11 గంటలకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కానూరులో...

కానూరు సనత్‌నగర్ రామాలయంలో హనుమంతుడి జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. యనమలకుదురులో కొండపై వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి ఆలయంలో ఉన్న నిలువెత్తు అభయాంజనేయ స్వామి వారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: హనుమజ్జయంతి వేడుకలు వాడవాడలా గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ఆంజనేయస్వామి దేవస్థానాల్లో విశేష పూజా కార్యక్రమాలు జరిపించి కనులారా స్వామిని దర్శించుకున్నారు. ఉయ్యూరు కాటూరు రోడ్డులోని హనుమాన్ నగర్‌లో 5 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, మాజీ చైర్మన్ జంపాన పూర్ణ చంద్రరావు (పూల), తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, 16వ వార్డు కౌన్సిలర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్య విభాగం కార్యదర్శి డాక్టర్ జంపాన పూర్ణిమ, పలువురు ప్రముఖులు హనుమాన్ నగర్‌లోని ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేయించారు. ఫ్లోరా వంతెన రోడ్డులోని సువర్చల ఆంజనేయ స్వామి వారి ఆలయంలో స్వామి వారికి మధుర ఫలాలతో అభిషేకం చేశారు. బస్టాండు సెంటరులోని దాసాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి నిర్వహించి వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

ఆపన్నులను ఆదుకోవటం సామాజిక బాధ్యత

కంకిపాడు: ఆపన్నులను ఆదుకోవటం సామాజిక బాధ్యత అని మదర్ థెరిస్సా సాంఘిక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి తాడితోటి నరసింహారావు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో దత్తత తీసుకున్న 100 మంది పేదలకు దాత జల్లి శ్రీధర్ సహకారంతో గురువారం భోజన వసతి కల్పించారు. దుస్తులు లేని నిరుపేదలకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో ఎంఎస్ రాజు, జల్లి అజిత్, డాక్టర్ జ్యూస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న హరికథాగానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు మారుతీ వ్యాయామ శాల ప్రాంగణంలోని శ్రీ అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం గుడిపాటి సుధాకర్ భాగవతార్ హనుమత్సందేశంపై చేసిన హరికథా గానం భక్తులను ఆకట్టుకుంది. సుధాకర్ భాగవతార్ హనుమంతుని సందేశాన్ని ఆయన జీవిత వృత్తాంతాన్ని అందరికీ అర్థమయ్యేరీతిలో వివరించారు. హనుమజ్జయంతిని పురస్కరించుకుని ఆలయ అర్చకుడు స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం స్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి మేళతాళాలతో ఊరేగింపు జరిగింది. కార్యక్రమాలను శిష్టా హనుమంతుప్రసాద్ పర్యవేక్షించారు.